క్లుప్తంగా

ఎస్సీ హోదా కల్పించాలి



నిరసన తెలుపుతున్న దళిత క్రైస్తవులు

కర్నూలు(సెంట్రల్): దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదాను కల్పించాలని కోరుతూ మంగళవారం కలెక్టరేట్ ఎదుట శాంతియుత నిరసనకు దిగారు. ఈ సందర్భంగా పాస్టర్లు ఎస్.భాస్కర్, గోరంట్ల జ్యాన్సెస్ మాట్లాడుతూ.. 75 సంవత్సరాల నుంచి దళిత క్రైస్తవులు ఎస్సీ హోదా కోసం పోరాటాడుతున్నా పాలకుల్లో చిత్త శుద్ధి లోపించి కార్యరూపం దాల్చడం లేదన్నారు. తాము ఇస్తున్న వినతి పత్రాలు చెత్తబుట్టల పాలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగ విరుద్ధమైన 1950 పేరా 3ని సవరించి తమకు ఎస్సీ హోదా ఇవ్వాలని, లేకపోతే భవిష్యత్‌లో పోరాటాలను ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

కర్నూలు కల్చరల్: కర్నూలు ప్రభుత్వ శారదా సంగీత, నృత్య కళాశాల ఆధ్వర్యంలో మంగళవారం హర్‌ఘర్ తిరంగా ర్యాలీని ఘనంగా నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థులు, కళాకారులచే కళాశాల నుంచి కొండారెడ్డి బురుజు వరకు జాతీయ జెండాలను చేతపట్టుకొని దేశభక్తి గీతాలు ఆలపిస్తూ, నినాదాలు చేస్తూ నిర్వహించిన ర్యాలీ శోభాయమానంగా సాగింది. ప్రిన్సిపాల్ మునికుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

రేపు బీఎస్ఎన్ఎల్ ఉచిత 4జీ సిమ్ మెగా మేళా



జి.రమేష్

కర్నూలు(హాస్పిటల్): బీఎస్ఎన్ఎల్ కర్నూలు బిజినెస్ ఏరియా పరిధిలోని అన్ని కార్యాలయాల వద్ద ఈ నెల 14వ తేదీన ఉచిత 4జీ సిమ్ మెగా మేళా నిర్వహిస్తామని ఆ సంస్థ కర్నూలు బిజినెస్ ఏరియా ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ జి.రమేష్ చెప్పారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కర్నూలు, నంద్యాల జిల్లాలోని అన్ని మొబైల్ టవర్లను 4జీ టవర్లుగా మార్చామన్నారు. స్వాతంత్య్ర దినోత్సవం జరుపుకుంటున్న ఈ నెలలో బీఎస్ఎన్ఎల్ ఫ్రీడం ప్లాన్‌ను దేశవ్యాప్తంగా ప్రవేశపెట్టారన్నారు. ఈ ఆఫర్ కింద కేవలం రూ.1కే 30 రోజుల పాటు ప్రతి రోజూ 2జీబీ డేటా, అపరిమితమైన కాల్స్,100 ఎస్ఎంఎస్‌లు పొందవచ్చని తెలిపారు. ఇతర ఆపరేటర్ నుంచి బీఎస్ఎన్ఎల్‌కు పోర్టు అయిన వారికి కూడా ఈ ఆఫర్ వర్తిస్తుందని, ఈ ఆఫర్ ఈ నెల 31వ తేది వరకు మాత్రమే ఉంటుందని చెప్పారు. వినియోగదారులు దగ్గరలో ఉన్న బీఎస్ఎన్ఎల్ కార్యాలయాలు, సేవా కేంద్రాలు, రిటైలర్లను సందర్శించి ఉచిత ఆఫర్‌ను పొందాలని సూచించారు.

మందుబాబులకు జరిమానా

కర్నూలు: మద్యం సేవించి వాహనాలు తోలుతూ డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి 'కిక్కు' దిగేలా జరిమానా విధిస్తూ ఎక్సైజ్ కోర్టు ఇన్‌చార్జ్ న్యాయమూర్తి అనిల్‌కుమార్ తీర్పు చెప్పారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ట్రాఫిక్ పోలీసులు ప్రతిరోజూ నగరంలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇందులో పట్టుబడిన పది మందిని మంగళవారం ట్రాఫిక్ పోలీసులు ఎక్సైజ్ కోర్టులో హాజరుపర్చగా ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున రూ.లక్ష జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చినట్లు ట్రాఫిక్ సీఐ మన్సురుద్దీన్ తెలిపారు.

చదువుతోపాటు ఆరోగ్యం ఇవ్వాలి



విద్యార్థినికి ఆల్బెండజోల్ మాత్ర వేస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

కర్నూలు సిటీ: విద్యార్థులకు చదువుతో పాటు మంచి ఆరోగ్యాన్ని ఇవ్వాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అన్నారు. మంగళవారం స్థానిక బిక్యాంపులోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చదువు మీద శ్రద్ధ సారించాలంటే మెదడు చురుగ్గా పని చేయడానికి విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలన్నారు. హిమోగ్లోబిన్ శాతం తక్కువ ఉన్న విద్యార్థులకు ఏఎన్ఎంలు ఐరన్, ఫోలిక్ యాసిడ్ టాబ్లెట్లను ఇస్తున్నారా?.. అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. బాల, బాలికల్లో పౌష్టికాహార లోపం, రక్తహీనతకు కారణమయ్యే నులిపురుగులను నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తుందన్నారు. ఏదైనా కారణం చేత మాత్రలు అందని విద్యార్థులకు స్కూల్‌కి వచ్చిన వెంటనే మాత్రలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాల ని ఉపాధ్యాయ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం స్కూల్ సిబ్బంది తమ పాఠశాలకు కాంపౌండ్ వాల్ నిర్మించాలని కలెక్టర్‌ను కోరగా, ప్రతిపాదనలు సిద్ధం చేయాలని డీఈఓ ఎస్.శ్యాముల్ పాల్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో డీఎంఅండ్ హెచ్ఓ శాంతికళ, హెచ్ఎం మేరీ సునీత, తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు (హాస్పిటల్): జిల్లాలో 93.67 శాతం మంది పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు వేసినట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ పి.శాంతికళ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 1 నుంచి 19 ఏళ్ల లోపు పిల్లలు 6,54,840 మంది ఉన్నారని, కార్యక్రమంలో భాగంగా మంగళవారం 6,13,388 మందికి మాత్రలు వేసినట్లు తెలిపారు. మిగిలిన వారికి ఈనెల 20న మాపప్ రౌండ్‌లో మాత్రలు వేస్తామన్నారు.

నీడ్ అసెస్‌మెంట్ సర్వే పూర్తి చేయాలి

కర్నూలు (సెంట్రల్): పీ - 4 పాలసీకి సంబంధించి పెండింగ్‌లో ఉన్న నీడ్ అసెస్‌మెంట్ సర్వేను రేపటి లోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలను ఆదేశించారు. ఆయన మంగళవారం సాయంత్రం ఆర్‌డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు కలెక్టర్ మాట్లాడుతూ.. పీ-4 పాలసీ కింద జిల్లాలో ఇప్పటివరకు 50,904 బంగారు కుటుంబాలను మార్గదర్శకులు దత్తత తీసుకున్నారన్నారు. ఇంకా 9 వేల కుటుంబాల దత్తత ప్రక్రియ పెండింగ్‌లో ఉందని, దీన్ని వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. బంగారు కుటుంబాల అవసరాలు తెలుసుకునేందుకు చేపట్టే నీడ్ అసెస్‌మెంట్ సర్వేపై మండలాల వారీగా సమీక్షించారు. రేపు సాయంత్రం లోపు సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. ఈపీటీఎస్ పోర్టల్‌లో డాక్యుమెంట్ల అప్‌లోడ్‌కు సంబంధించి అన్ని శాఖల అధికారులు మెమోలు, జీఓలు, సర్క్యులర్లు, ప్రొసీడింగ్స్, కార్యాలయ ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ అప్‌లోడ్ చేయాలన్నారు. అప్‌లోడ్ చేయడంలో వెనకబడిన జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి పురోగతి తీసుకురావాలని డీఆర్వోను ఆదేశించారు. టెలీ కాన్ఫరెన్స్‌లో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ, మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్, ఆర్డీఓ సందీప్ కుమార్, పత్తికొండ ఆర్‌డీఓ భరత్ నాయక్, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, జిల్లా అధికారులు, ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.

డీ-ఫార్మసీకి దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు సిటీ: ఎస్.జి పుల్లారెడ్డి ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో డీ-ఫార్మసీ రెండేళ్ల కాల వ్యవధి గల కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.ఎస్.ఎస్.ఎన్ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ బైపీసీ, ఎంపీసీ రెగ్యులర్, ఓపెన్ స్కూల్ విద్యార్థులు ఈ కోర్సుకు అర్హులన్నారు. ఈనెల 19లోపు విద్యార్థులు https://apsbtet.in/pharmacy అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9441825230, 966621 7 601, 9494138227 నంబర్లను సంప్రదించాలన్నారు.

15న 'సైరా' పద్యనాటకం

కర్నూలు కల్చరల్: స్వాతంత్య్ర దినోత్సవం పురస్కరించుకొని ఈనెల 15వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో 'సై సైరా నరసింహా రెడ్డి' చారిత్రక పద్య నాటక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తెలిపారు. సురభి ప్రభావతి, హసీనా, శ్రీనివాసరెడ్డి, బాలవెంకటేశ్వర్లు, రాముడు, రాజా తర్నం, నవీన్‌కుమార్ చౌదరి, భాస్కర్, మహమ్మద్ మియ్యా, గాండ్ల లక్ష్మన్న తదితరులు నటిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి కేవీ రమణ కన్వీనర్‌గా వ్యవహరిస్తారని తెలిపారు.

పల్లె ప్రగతి అంచనాకు పురోగతి సూచికలు

- వర్క్‌షాప్‌లో జెడ్పీ సీఈఓ జి నాసరరెడ్డి



పంచాయతీ పురోగతి సూచిక వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి

కర్నూలు(అర్బన్): గ్రామ పంచాయతీల్లో అభివృద్ధిని అంచనా వేసేందుకు, డేటా ఆధారిత పాలనను ప్రోత్సహించేందుకు పంచాయతీ పురోగతి సూచిక ఎంతో ఉపయోగపడుతుందని జిల్లా పరిషత్ సీఈఓ జి. నాసరరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ప్రాంగణంలోని డీపీఆర్‌సీ భవనంలో వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులకు పంచాయతీ పురోగతి సూచిక వెర్షన్ 1.0 నుంచి వర్షన్ 2.0కు పరివర్తన వ్యాప్తిపై ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి జి. భాస్కర్, సివిల్ సప్లయిస్ అధికారి రాజారఘువీర్, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ పి. రాధిక, బీసీ సంక్షేమం సాధికారత అధికారిణి కె. ప్రసూన, డీఆర్‌డీఏ పీడీ రమణారెడ్డి , డ్వామా పీడీ వెంకటరమణ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ వర్షన్ అప్‌గ్రేడ్ కావడంతో మరింత వేగంగా ప్రణాళికలను సిద్ధం చేసేందుకు అవకాశం ఏర్పడిందన్నారు. పేదరికం లేని మెరుగైన జీవనోపాధులు కలిగిన గ్రామం, ఆరోగ్యం, బాల హిత, సమృద్ధిగా నీరు, స్వచ్ఛ హరిత, ప్రజలకు అవసరమైన మౌళిక సదుపాయాలు, సామాజిక న్యాయం , భద్రత, సుపరిపాలన, మహిళా హిత థీమ్స్ ఆధారంగా గ్రామ పంచాయతీ స్థాయిలో అన్ని శాఖలు సమన్వయంతో ప్రగతిని సాధించాలని కోరారు. జిల్లా పంచాయతీ అధికారి మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలోని ప్రజల సామాజిక ఆర్థిక పరిస్థితులను, జీవన ప్రమాణ స్థాయిలను ప్రభావితం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల అమలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీపీఆర్‌సీ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ మంజులవాణి,ట్రెనింగ్ మేనేజర్ గిడ్డేష్ , టీఓటీలు అస్రఫ్‌భాష, పీ జగన్నాథం, కే జ్యోతి పాల్గొన్నారు.

క్రిష్ణానగర్‌లో చోరీ

కర్నూలు: క్రిష్ణా నగర్‌లోని పాత మంచినీటి ట్యాంకు సమీపంలో నివాసముంటున్న విజయకుమార్ ఇంట్లో దొంగలు పడి అందినమట్టుకు మూటగట్టుకుని ఉడాయించారు. ఈయన సోదరి సచివాలయ ఉద్యోగిగా పనిచేస్తోంది. ఈనెల 10వ తేదీన ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి ఉరుకుంద ఈరన్న స్వామి దర్శనానికి వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దొంగలు ఇంటి తాళాలు పగులకొట్టి గదిలోకి వెళ్లి అల్మారాలోని బ్యాగులో దాచిఉంచిన 10 తులాల బంగారు నగలు మూటకట్టుకుని ఉడాయించారు. విజయకుమార్ కుటుంబ సభ్యులు మంగళవారం ఇంటికి వచ్చే సమయానికి తలుపులు తెరచిఉన్నాయి. గదిలోకి వెళ్లి చూడగా అల్మారాలోని సామాన్లన్నీ చిందరవందరగా పడివుండటంతో చోరీ జరిగిందని నిర్ధారించుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాల్గవ పట్టణ ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి క్రైం పార్టీ సిబ్బందితో కలిసి నేరం జరిగిన తీరును పరిశీలించారు. సమీపంలోని సీసీ ఫుటేజీని సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు విచారణ చేస్తున్నారు.

హాస్టల్‌కు ఫ్యాన్లు, కుర్చీల వితరణ

కర్నూలు(అర్బన్): నగరంలోని ప్రభుత్వ బీసీ బాలికల వసతి గృహానికి మంగళవారం గురు అశోక్ సేవా ఫౌండేషన్ వివిధ రకాల వస్తువులను విరాళంగా అందించిందని వసతి గృహ సంక్షేమాధికారిణి శైలజ తెలిపారు. వసతి గృహంలోని బాలికల ఇబ్బందులను ఫౌండేషన్ దృష్టికి తీసుకుపోగా హాస్టల్‌కు అవసరమైన గ్రైండర్, బీరువా, ఆరు ప్లాస్టిక్ కుర్చీలు, ఏడు ఫ్యాన్లు, 10 ట్యూబ్ లైట్లను అందించారని చెప్పారు. ఫౌండేషన్ ప్రతినిధులు డీ.సునందనదాస్, కే.హైమావతికి హెచ్‌డబ్ల్యూఓ శైలజ కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ

- దాడులతో జగనన్నపై ఉన్న అభిమానాన్ని దెబ్బతీయలేరు
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేందర్‌రెడ్డి



వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేందర్ రెడ్డి

కర్నూలు (టౌన్): కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని, ఇందుకు పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికల పోలింగ్ ఉదాహరణ అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేందర్ రెడ్డి విమర్శించారు. ఆయన మంగళవారం స్థానిక సీతారామ నగర్‌లోని కార్యాలయంలో మాట్లాడుతూ.. ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసే అవకాశం కల్పించకుండా కూటమి నాయకులు, కార్యకర్తలు దాడులు, దౌర్జన్యాలు, అరెస్టులు చేయించి రిగ్గింగ్‌కు పాల్పడ్డారన్నారు. నిజంగా కూటమి ఏడాది పాలన పట్ల ప్రభుత్వానికి నమ్మకం ఉంటే ఎందుకు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ దాడులకు పాల్పడుతున్నారని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ ఏజెంట్లపై దాడులు చేయడం, ఏజెంట్ ఫారంలను చింపివేసి వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను బయటకు నెట్టివేయడం అప్రజాస్వామికమన్నారు. కూటమి ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని మండిపడ్డారు. రాష్ట్రంలోని ప్రజలు కూటమి ప్రభుత్వ దౌర్జన్యాలను గమనిస్తున్నారన్నారు. దాడులతో జగనన్నపై ఉన్న అభిమానాన్ని దెబ్బతీయ లేరన్నారు. రాబోయే ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి ప్రజలే గుణపాఠం చెబుతారన్నారు.

యువతతోనే దేశాభివృద్ధి



బహుమతులు అందుకున్న వారితో క్లస్టర్ వర్సిటీ రిజిస్ట్రార్, సెట్కూరు సీఈఓ

కర్నూలు సిటీ: జిల్లా యువజన శాఖ – సెట్కూరు ఆధ్వర్యంలో మంగళవారం సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీలో అంతర్జాతీయ యువజన దినోత్సవం, హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. సెట్కూరు సీఈఓ డాక్టర్ కె.వేణుగోపాల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు పాల్గొని ప్రసంగించారు. దేశాభివృద్ధికి యువత ధృడ సంకల్పంతో ముందుకు నడవాలన్నారు. సమాజ ఆధారిత వాస్తవాలను యువత గ్రహించాలని, స్వాతంత్య్ర సమరయోధుల ఆశయాలకు అనుగుణంగా నడవాలన్నారు. ఆ తరువాత సెట్కూరు సీఈఓ డాక్టర్ కె.వేణుగోపాల్, ప్రిన్సిపల్ శ్రీనివాస్ ప్రసంగించారు. అనంతరం యువతలో సృజనాత్మకతను వెలికి తీసేందుకు వివిధ రకాల సెమినార్లు, పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

బంగారంపై రుణాల వడ్డీరేటు తగ్గింపు

కర్నూలు(అగ్రికల్చర్): బంగారం ఆభరణాలపై రైతులు తీసుకునే రుణాలపై వడ్డీరేటును 9.25 శాతం నుంచి 9.10 శాతానికి తగ్గిస్తూ ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్రబ్యాంకు బోర్డు సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. మంగళవారం బోర్డు సమావేశం డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జ్ చైర్మన్ డి.విష్ణువర్ధన్‌రెడ్డి అధ్యక్షతన ప్రధాన కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా పలు నిర్ణయాలు తీసుకున్నారు. కర్నూలు జిల్లాలో కొత్తగా 7 శాఖలను ఏర్పాటు చేయాలని బోర్డు సమావేశం తీర్మానించిందని చైర్మన్ పేర్కొన్నారు. గోనెగండ్ల, మద్దికెర, మామిదాలపాడు, వెల్దుర్తి, సి.బెళగల్, కొతాళం, కోసిగిలల్లో నూతన శాఖల ఏర్పాటుకు వైబులిటీ రిపోర్టును తెప్పించి రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియాకు పంపాలని ఆదేశించారు. ఉమ్మడి జిల్లాలో సహకార సంఘాలు ఎరువుల వ్యాపారం చేసేందుకు రూ.25 లక్షల వరకు బ్యాంకు గ్యారెంటీ ఇవ్వాలని నిర్ణయించినట్లు ప్రకటించారు. ప్యాక్స్ డెవలప్‌మెంట్ సెల్ ద్వారా ఎరువుల వ్యాపారం చేసేందుకు మామిదాలపాడు సొసైటీకి చెందిన మునగాలపాడులోని పాత గోదామును పునర్నిర్మించేందుకు మొదటి విడతగా రూ.17.66 లక్షలు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా డీసీసీబీలో స్టాఫ్ అసిస్టెంట్లుగా 37 మందికి నియామకపు ఉత్తర్వులు అందజేసి విధి నిర్వహణలో జవాబుదారితనంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఈఓ పి. రామాంజనేయులు, నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి, జిల్లా సహకార అధికారి వెంకటకృష్ణ, ఆప్కాబ్ డీజీఎం దినేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌జీజీవోస్ జిల్లా అధ్యక్షుడికి సన్మానం



వెంగళ్‌రెడ్డి దంపతులను సత్కరిస్తున్న ఎన్‌జీఓ నేతలు

కర్నూలు(అగ్రికల్చర్): ఏపీ ఎన్‌జీజీవోస్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా 20 ఏళ్ల పాటు పని చేసి ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు, పెన్షనర్ల అభ్యున్నతికి విశేషంగా కృషి చేసిన వీసీహెచ్ వెంగళ్‌రెడ్డి పదవీ విరమణ సంఘానికి తీరని లోటని రాష్ట్ర అధ్యక్షుడు ఏ.విద్యాసాగర్ అన్నారు. జిల్లా ట్రెజరీ కార్యాలయంలో సీనియర్ అకౌంటెంటుగా పనిచేస్తూ వెంగళ్‌రెడ్డి జూలై 31న పదవీ విరమణ చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా సంఘం మంగళవారం బిర్లాగేట్ సమీపంలోని లక్ష్మి ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సన్మాన సభ నిర్వహించింది. రాష్ట్ర సంఘం అధ్యక్ష, కార్యదర్శులు విద్యాసాగర్, రమణ అతిథులుగా హాజరయ్యారు. వెంగళ్‌రెడ్డి దంపతులను సత్కరించి ఆయన సేవలను కొనియాడారు. త్వరలోనే కర్నూలు, నంద్యాల జిల్లాలకు నూతన అడ్‌హక్ కమిటీలను ప్రకటిస్తామన్నారు.

తోపులాట: జిల్లా అసోసియేషన్ నుంచి బహిష్కరణకు గురైౖ రాష్ట్ర సంఘం ఆదేశాలతో కొనసాగుతున్న జవహర్‌లాల్, సాంబశివారెడ్డి, రమణ, పి.రామకృష్ణారెడ్డి తదితరులు కలెక్టరేట్‌లోని గోకులం సమావేశ మందిరంలో రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్‌ను సత్కరించేందుకు ఏర్పాట్లు చేశారు. వారి ఆహ్వానం మేరకు ఆయన కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా ఎన్‌జీవో నేతలు అడ్డుకున్నారు. దీంతో తోపులాట జరిగింది. కలెక్టరేట్ మెయిన్ గేటు వద్దకు వచ్చి ఆయన సన్మానం పొందారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు



అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ పి.విశ్వనాథ్

కర్నూలు (టౌన్): నగరంలో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ పి.విశ్వనాథ్ వెల్లడించారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో కమిషనర్ సమీక్ష నిర్వహించారు. నగర పరిధి రోజు రోజుకు విస్తరిస్తున్నందున వచ్చే మూడు దశాబ్దాలను దృష్టిలో పెట్టుకొని తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రతిపాదనలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. జగన్నాథగట్టు వద్ద 30 ఎంఎల్‌డీ నీటి శుద్ధి కేంద్రం ఏర్పాటు చేస్తే ఏడాదిలో 7 నెలలు తాగునీటిని వినియోగించుకోవచ్చన్నారు. మిగతా 5 నెలల అవసరాలకు మునగాలపాడు సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నుంచి జగన్నాథ గట్టు వరకు పైపులైన్ నిర్మాణం చేపట్టాలన్నారు. ఇందుకు రూ.135 కోట్లతో ప్రతిపాదనలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. డిప్యూటీ కమిషనర్ సతీష్‌కుమార్ రెడ్డి, జలవనరుల శాఖ ఎస్ఈ బాలచంద్రారెడ్డి, ప్రజారోగ్య సాంకేతిక శాఖ డీఈ రాంమోహన్ రెడ్డి, గ్రామీణ నీటి సరఫరా ఎస్ఈ అమల, మున్సిపల్ ఈఈ మనోహర్ రెడ్డి, డీఈఈలు పాల్గొన్నారు.

– పన్ను వసూళ్లపై నిర్లక్ష్యం తగదని కమిషనర్ సూచించారు. మొండి బకాయిలు వసూలు చేయడంలో అలసత్వం ప్రదర్శించే సచివాలయ ఉద్యోగులతో పాటు రెవెన్యూ ఆఫీసర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లకు మెమోలు జారీ చేయాలని ఆదేశించారు. పన్ను వసూళ్లలో ఇబ్బంది ఎదురైతే చట్టపరంగా చర్యలుతీసుకోవాలన్నారు.

సేవా కార్యక్రమాల్లో ముందుండాలి

సామాజిక సేవా కార్యక్రమాల్లో స్వచ్ఛంద సంస్థలు ముందుండాలని కమిషనర్ పి.విశ్వనాథ్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక అశోక్‌నగర్‌లోని నీటి శుద్ధి కేంద్రంలో కర్నూలు ప్రగతి సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.శ్రీహర్ష ఆధ్వర్యంలో నాన్ పబ్లిక్ హెల్త్ వర్కర్లకు రెయిన్ కోట్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. కార్మికుల కష్టానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ప్రోత్సాహం ఇస్తాయన్నారు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని, తమ వంతుగా సహకారం అందిస్తామన్నారు. డీఈఈలు గిరిరాజ్, నరేష్ పాల్గొన్నారు.

15న హిందీ పాటల విభావరి

కర్నూలు కల్చరల్: స్వాతంత్య్ర దినోత్సవం పురస్కరించుకొని స్మార్ట్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీ సాయంత్రం 6 గంటలకు ఓల్డ్‌సిటీ కింగ్ మార్కెట్ సమీపంలోని ఉర్దూ ఫంక్షన్ హాల్‌లో హిందీ సినిమా పాటల సంగీత విభావరి ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. గాయకులు సినీ పాటలు ఆలపిస్తారని పేర్కొన్నారు.

బిడ్డను ప్రసవించి మహిళ మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ కుటుంబసభ్యుల ఆందోళన



సమీరాబేగం మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబసభ్యులు

కర్నూలు(హాస్పిటల్): ప్రసవానికి వచ్చిన గర్భిణి బిడ్డను ప్రసవించి మృతి చెందడంతో కుటుంబసభ్యులు ఆసుపత్రి వద్ద ఆందోళన చేశారు. మృతురాలి భర్త సమీర్‌బాషా చెప్పిన మేరకు వివరాలు.. కర్నూలులోని పాతబస్తీకి చెందిన నజియా బేగం (22) గర్భం దాల్చిన నాటి నుంచి గైనకాలజిస్టు డాక్టర్ రోహేలా వద్ద వైద్య పరీక్షలు చేయించుకుంటోంది. ఆమె సలహా మేరకు సోమవారం రాత్రి ప్రసవం కోసం ఎన్ఆర్ పేటలోని శ్రీ నోబుల్ నర్సింగ్ హోమ్‌లో అడ్మిట్ అయ్యింది. మంగళవారం ఉదయం 8 గంటల సమయంలో ఆమె సిజేరియన్ ద్వారా మగశిశువును ప్రసవించింది. శిశువును కుటుంబ సభ్యుల చేతికి ఇచ్చి తల్లిని మాత్రం వైద్యులు ఐసీయూలో ఉంచి చికిత్స చేయసాగారు. దీంతో కుటుంబసభ్యులకు అనుమానం వచ్చి ఆమెను చూపాలని పలుమార్లు అడిగినా ఏమీ కాలేదని చెబుతూ వచ్చారు. చివరకు మధ్యాహ్నం 12 గంటలకు ఆమె మరణించిందని చెప్పడంతో కుటుంబసభ్యులు ఆందోళనకు దిగారు. దీంతో సాయంత్రం 5 గంటల వరకు ఆసుపత్రి వద్ద ఉద్రిక్తత నెలకొంది. సాధారణ ప్రసవం చేస్తానని చెప్పి సిజేరియన్ చేశారని, వైద్యం చేయడంలో నిర్లక్ష్యం చేయడం వల్లే తన భార్య మరణించిందని భర్త సమీర్‌బాషా ఆవేదన వ్యక్తం చేశారు. రెండవ పట్టణ పోలీసులు ఆసుపత్రి వద్దకు చేరుకుని పరిస్థితిని అదుపు చేశారు. ఈ విషయమై ఆస్పత్రి మేనేజర్ రామచంద్రజీ మాట్లాడుతూ.. ప్రసవం అనంతరం నజియాబేగంకు అకస్మాత్తుగా పల్మని ఎడిమా డెవలప్ అయ్యిందని, దానికి చికిత్స చేస్తుండగానే కార్డియాక్ అరెస్ట్‌తో మరణించినట్లు తెలిపారు. ఇందులో వైద్యుల నిర్లక్ష్యం ఏమీ లేదన్నారు.

అవీ - ఇవీ

లేబర్ కమిషనర్ కార్యాలయ ముట్టడికి పిలుపు

కర్నూలు(సెంట్రల్): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరుతూ సెప్టెంబర్ 15వ తేదీన చేపట్టే లేబర్ కమిషనర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.నరసింహులు పిలుపునిచ్చారు. మంగళవారం మట్టి పని అడ్డాలో కార్మికులతో ఆయన మాట్లాడుతూ.. విజయవాడలోని లేబర్ కమిషనర్ కార్యాలయం ముట్టడికి జిల్లా నుంచి అధిక సంఖ్యలో కార్మికులు తరలి వెళ్లాలని సూచించారు. సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తే అనేక లాభాలు ఉన్నాయని, దాన్ని సాధించుకోవడం కోసం పోరాటాలు తప్పా మరో దారి లేదన్నారు.

విద్యార్థుల సమస్యలపై పోరాటం

కర్నూలు(సెంట్రల్): దేశవ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఎన్ఎస్‌యూఐ జాతీయ కార్యదర్శి నాగమధుయాదవ్ పేర్కొన్నారు. తనకు ఈ పదవి రావడానికి కృషి చేసిన కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ తదితరులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం ఎన్ఎస్‌యూఐ జాతీయ కార్యదర్శిగా ఎన్నికైనా నాగ మధు యాదవ్‌ను జిల్లా ఎన్ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్ విభాగాల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అంతకుముందు బళ్లారి చౌరస్తా నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ సుధాకర బాబు, డీసీసీ మాజీ అధ్యక్షుడు బాబు రావు, ఎన్ఎస్‌యూఐ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసయాదవ్, వీరేష్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలి

కర్నూలు (టౌన్): కాకినాడ జిల్లా పిఠాపురంలో ఈనెల 14 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించే 10వ జూనియర్ బాల బాలికల బాస్కెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చాటాలని సింగిల్ విండో చైర్మన్ సూర్యప్రకాష్ రెడ్డి, విష్ణుసేన నాయకులు గౌతమ్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలోని బాస్కెట్‌బాల్ కోర్టు ప్రాంగణంలో పోటీలో పాల్గొనే క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి పోటీలను అవకాశంగా మలచుకొని సత్తా చాటి జిల్లాకు పేరు తీసుకురావాలన్నారు.

టీడీపీలో నామినేటెడ్ పదవులు

కర్నూలు (హాస్పిటల్): ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన ముగ్గురికి తెలుగుదేశం పార్టీ నామినేటెడ్ పదవులు ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ కులాల కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు కోడుమూరుకు చెందిన ఆకెపోగు ప్రభాకర్, ఆంధ్రప్రదేశ్ బొందిలి సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్‌కు కర్నూలుకు చెందిన డి.విక్రమ్ సింగ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్‌కు పాణ్యంకు చెందిన కమ్మరి పార్వతిలను నియమించారు.

శక్తి యాప్‌కు 14 వేల డౌన్‌లోడ్‌లు

కర్నూలు: మార్చి 8న ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు శక్తి యాప్‌ను జిల్లాలో 14,137 మంది డౌన్‌లోడ్ చేసుకున్నారని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. ఆండ్రాయిడ్ ఫోన్ ఉన్న ప్రతి మహిళ శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని రిజిస్టర్ చేసుకోవాలని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండానే శక్తి యాప్ ద్వారా డయల్ 112, ఎస్ఓఎస్ బటన్ ద్వారా మహిళలు తమ సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. అత్యవసర సహాయం కోసం 79934 85999 నంబర్‌కు కాల్, మెసేజ్ చేసినా సంబంధిత కమాండ్ కంట్రోల్ రూమ్‌కు సంకేతాలు వెళతాయని, వెంటనే శక్తి టీమ్ స్పందించి ఆపదలో ఉన్న మహిళలను ఆదుకుంటుందని వెల్లడించారు.

14 మంది ఉద్యోగులకు స్థానభ్రంశం

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలోని వివిధ సచివాలయాల్లో పని చేస్తూ పన్ను వసూళ్లలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న 14 మంది సచివాలయ ఉద్యోగులకు నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ స్థానభ్రంశం కల్పించారు. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.